సాక్షి నారాయణపేట

గురువారం । 17 । అక్టోబర్ । 2024



జూరాల గేట్లు మూసివేత

ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గిపోవడంతో జూరాల ప్రాజెక్టు గేట్ల మూసివేశారు.

వివరాలు 8లో ▸



అక్రమాలు తేలితే చర్యలు

క్వారీల నిర్వహణలో అక్రమాలు తేలితే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మైన్స్ డీడీ తెలిపారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.5 /21.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో కొత్త కోర్సులు

నారాయణపేట: ఐటీఐలో కొత్తగా ఆరు కోర్సులు ప్రవేశపెట్టిందని, ఈ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా లేబర్ అధికారి మహేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 వరకు దరఖాస్తు చేసుకుంటే వారి ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని, **ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని** కోరారు. అధునాతన సీఎన్‌సీ **మ్యాచింగ్,** మెకానిక్, అధునాతన సాధనాన్ని **ఉపయో**గించే ఆర్టిసన్, ఇండస్ట్రీయల్ రో**బోటిక్స్ అం**డ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ **టెక్నీషియన్,** తయారీ ప్రక్రియ, నియంత్రణ **ఆటోమేషన్** కోర్సుల్లో పదో తరగతి పాసైన **విద్యార్థుల** నుంచి దరఖాస్తులు **ఆహ్వానిస్తున్నట్లు** ఆయన తెలిపారు.

'విదేశీ విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు అంబేడ్కర్ విదేశీ విద్యానిధికి ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కజ్జం ఉమాపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, సైన్స్, హుమానటీస్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు పైచదువులు విదేశాలలో చదువుకోరే విద్యార్థినీ-విద్యార్థులు దరఖాస్తులు నేరుగా epass వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ ఆదాయం రూ.5లక్షలకు మించకూడదని, వయస్సు 35సం.లోపు ఉండాలని తెలిపారు. ఈ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని, డిగ్రీ పరీక్షలో 60 శాతం మార్కులు, గుర్తింపు పొందిన విదేశీ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ పొంది ఉండాలని, GQE,GMAT,TOFEL,IELT నందు 60 శాతం మార్కులు కలిగిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చట్టబద్ధంగా ఉంటేనే పిల్లల దత్తత చెల్లుబాటు



కోస్గి: సరైన అవగాహన లేకుండా పిల్లలను దత్తత తీసుకుంటే న్యాయపరమైన ఇబ్బందులు తప్పవని, చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటేనే చెల్లుబాటు అవుతుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి తిరుపతయ్య, ప్రొటెక్షన్ అధికారి కరిష్మా సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చట్టపరంగా పిల్లల దత్తత అనే అంశంపై అవగాహన కల్పించారు. చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకుంటే వచ్చే న్యాయపరమైన ఇబ్బందులు, శిక్షలను సమగ్రంగా వివరించారు. బాలల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ జిల్లాలో ఎక్కడైన 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లలు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్న బాలల సంరక్షణ విభాగానికి సమాచారం ఇవ్వాలన్నారు. బాలకార్మిక చట్టాలు, బాల్య వివాహ చట్టాలు, బాలలపై లైంగిక దాడులకు సంబంధించిన చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు నందకిషోర్, వెంకట్‌రాంరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణకాంత్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులు జీపీఎఫ్‌లో దాచుకున్న అవసరాలకు తీసుకునే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. సంవత్సరానికి రెండుసార్లు రావాల్సిన కరువు భత్యం ఐదు వాయిదాలున్నా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ కుబేర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పద్ధతిని అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల మెడికల్ బిల్లు రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ సంఘాల జేఏసీని పిలిపి సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.



జూరాల జెన్‌కో స్విచ్ యార్డు

వెలుగుల జిగేల్

జూరాల జలవిద్యుత్ కేంద్రాల్లో పరుగులు పెడుతున్న విద్యుదుత్పత్తి

- మొత్తం 474 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం
- ఈ ఏడాది 600 మిలియన్ యూనిట్లు లక్ష్యం
- ఇప్పటి వరకు 525.680 మి.యూ., ఉత్పత్తి
- ఎగువ నుంచి వచ్చే వరద నీరే ఆధారం

ఉమ్మడి పాలమూరు పెద్దన్నగా పిలుచుకునే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడమే కాకుండా.. విద్యుదుత్పత్తిలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. ఇక్కడి ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ.. వెలుగులు ప్రసరిస్తోంది. కేవలం వరద నీరు ఆధారంగానే చేపట్టినా లక్ష్యానికి మించి ఉత్పత్తి చేస్తూ ప్రతి ఏటా రికార్డులు సృష్టిస్తోంది. గడిచిన పదేళ్లలో ఇప్పటి వరకు 5,400 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టగా.. 2022- 23లో ప్రాజెక్టు చరిత్రలోనే 640 మి.యూ., లక్ష్యానికి మించి 876 మి.యూ., విద్యుదుద్పత్తి చేపట్టి రికార్డు సృష్టించారు. – ఆత్మకూర్

తెలంగాణ రాష్ట్రంలోని కృష్ణానదిపై మొదటి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాలపై నిర్మించిన జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి పరుగులు పెడుతోంది. ఈ ఏడాది 600 మిలియన్ యూనిట్ల లక్ష్యం విద్యుదుత్పత్తి చేపట్టేందుకు చేరువలో ఉన్నారు. గతేడాది 2023- 24 వర్షాభావ పరిస్థితులు, ఎగువ నుంచి ప్రాజెక్టుకు నీరు చేరకపోవడంతో 640 మి.యూ., లక్ష్యానికి గాను 212 మి.యూ., మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఎగువ, దిగువలో అతి తక్కువగా విద్యుదుత్పత్తి గతేదాది కావడం విశేషం. అలాగే 2022- 23లో జూరాలకు వరద నీరు పెద్ద ఎత్తున చేరడంతో ప్రాజెక్టు చరిత్రలోనే 640 మి.యూ., లక్ష్యానికి మించి 876 మి.యూ., విద్యుదుద్పత్తి చేపట్టి రికార్డు సృష్టించారు. 2020- 21 ఆర్థిక సంవత్సరానికి గాను 648 మి.యూ., టార్గెట్‌కు గాను 775 మి.యూ., 2021-22లో 724 మి.యూ., టార్గెట్‌కు 704 మి.యూ., సాధించారు.

వరద వస్తేనే..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువనున్న కర్ణాటక రాష్ట్రంలోని నారాయణపూర్, ఆల్మట్టి డ్యాంల నుంచి వరద వస్తేనే జూరాలలో విద్యుదుత్పత్తి చేపడుతారు. ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో అక్కడి ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీరు చేరిన తర్వాత దిగువకు నీటిని వదులుతారు. దీంతో ప్రతిరోజు జూరాల దిగువ జల విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, అలాగే ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలోని 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతారు.



దిగువ జూరాల పవర్‌హౌజ్

పదేళ్లలో విద్యుదుత్పత్తి ఇలా (మిలియన్ యూనిట్లలో)..

సంవత్సరం	ఎగువ కేంద్రం	దిగువ కేంద్రం
2014- 15	225	0
2015- 16	316	45
2016- 17	213	177
2017- 18	217	206
2018- 19	166	154
2019- 20	301	305
2020- 21	370	405
2021- 22	335	369
2022- 23	450	426
2023- 24	101	111
2024- 25	273	252

మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం..

జూరాల ఎగువ జల విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్లకు గాను మూడో యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఐదు యూనిట్ల ద్వారానే విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. మూడో యూనిట్‌లో గతేడాది సాంకేతిక సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల ద్వారా సంబంధిత కంపెనీకి సమాచారం ఇచ్చారు. కానీ, నిపుణులు చైనా దేశం నుంచి రావాల్సి ఉండటంతో మరమ్మతు చేపట్టడంలో ఆలస్యమవుతున్నట్లు తెలిసింది. ఫలితంగానే ఇక్కడ 5 యూనిట్లలోనే విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

■ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేపట్టే విధానం ఈ విధంగా ఉంది. దిగువ జూరాలలో ఆరు యూనిట్లు ఉండగా ఒక్కొక్క యూనిట్‌లో 40 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. 24 గంటల పాటు 40 మెగావాట్ల ఉత్పత్తి చేపడితే 9,600 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. 100 ఓల్టేజీ బల్బులు 10 ఒక గంటసేపు వాడితే ఒక యూనిట్ కరెంట్ కర్చు అవుతుంది. 10 లక్షల యూనిట్లకు ఒక మిలియన్ యూనిట్ అవుతుంది. ఒక మిలియన్ యూనిట్ విద్యుదుత్పత్తికి గాను 0.78 టీఎంసీల నీటిని వినియోగిస్తారు.

సమష్టి కృషితోనే..



జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో సమష్టి కృషితోనే లక్ష్యం మేరకు విద్యుదుత్పత్తి చేపడుతున్నాం. మొత్తం 12 యూనిట్లకు గాను 11 యూనిట్ల ద్వారా ప్రతిరోజు విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. అయితే ఎగువలో మూడో యూనిట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ ఏడాది జూరాలకు ఎగువ ప్రాంతాల నుంచి అత్యధికంగా వరద నీరు వస్తుండటంతో ఇప్పటి వరకు 525.680 మి.యూ., ఉత్పత్తి చేపట్టాం. ఈ నెలాఖరు వరకు లక్ష్యం చేరుకుంటాం. వరద నీరు ఇలాగే కొనసాగితే టార్గెట్ మించి కూడా చేపట్టవచ్చు.

– కోటిపల్లి సూరిబాబు, ఎస్ఈ, జెన్‌కో

మెడికల్ కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి



మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా, చిత్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

- హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా

నారాయణపేట: నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం నారాయణపేట మెడికల్ కళాశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మెడికల్ కళాశాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్, టీజీ ఎంఐడిసి అధికారులు, కళాశాల వైద్య నిపుణులతో ఆమె మెడికల్ కళాశాల నిర్వహణపై సమీక్షించారు. మెడికల్ కళాశాలలో కేవలం ఒక సంవత్సరం తరగతులకు కావాల్సిన వసతులే కాకుండా ద్వితీయ సంవత్సర తరగతుల నిర్వహించేందుకు అవసరమైన వసతి సౌకర్యం సమకూర్చాలని సూచించారు. ఒకసారి కళాశాల తరగతులు ప్రారంభించిన తర్వాత మళ్లీ ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదన్నారు. తరగతులకు సరిపడా ఫర్నిచర్ వచ్చిందా? ఇంకా ఏమైనా అవసరం ఉంటే ఇండెంట్ పంపించాలని చెప్పారు. ప్రాక్టికల్స్ తరగతులను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మెడికల్ కళాశాల 3వ అంతస్తులో బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, ఇతర ల్యాబ్ లను ఏర్పాటు చేయాలని, వెనుకబడిన ఈ ప్రాంతంలో వైద్యపరంగా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆమె సూచించారు.

జిల్లా ఆస్పత్రి పరిశీలన

అంతకుముందు కలెక్టర్ అధికారుల బృందంతో కలిసి ఆమె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని, చిన్నపిల్లల ఆస్పత్రిని పరిశీలించారు. చిన్నపిల్లలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని వైద్యులను ఆదేశించారు. జిల్లా ఆస్పత్రి వార్డులలో చికిత్స పొందుతున్న రోగులను వైద్య సేవలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. అలాగే, ఫార్మసీలో ఏయే మందుల కొరత ఉందని తెలుసుకుని వాటి ఇండెంట్ ను పంపించాలని ఆదేశించారు. అనంతరం అధికారుల బృందంతో కలిసి పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని ఎంసిహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్) విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. కార్యక్రమంలో టీజీ ఎంఐడిసి ఎండీ హేమంత్, ట్రైనీ కలెక్టర్ గరిమానరుల, అకాడమిక్ డీఎంఈ శివరాం ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాంకిషన్, పాలమూరు మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, టీజీ ఎం ఐడిసి చీఫ్ ఇంజనీర్ దేవేందర్ కుమార్, ఈఈ జైపాల్ రెడ్డి, డీఎంహెచ్ఓ సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నీటి సంరక్షణే లక్ష్యం

2025-26 వార్షిక ఉపాధి కార్యక్రమాలకు ప్రణాళిక రూపకల్పన



నర్వ మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- ఊరూరా గ్రామ సభలు నిర్వహించి పనుల గుర్తింపు
- ఉద్యాన పంటలను పెంపొందించేలా అవగాహన

నర్వ: ఉన్న ఊరులోనే పనులు కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టగా.. 2025-26కు సంబంధించి జల సంరక్షణ, రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులకు అధిక ప్రాధాన్యత కల్పించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఇందులో బాగంగానే ఊరూరా గ్రామసభలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలసంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పంట కాల్వలు, నీటి, ఊటకుంటలు, ఇంకుడ గుంతలు, పాంపాండ్లు, కందకాలు, పొలాలకు వెళ్లేందుకు మట్టిదారులు వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన ఐదు ఎకరాల్లోపు భూములను చదును చేయడం, గొర్రెలు, మేకలు, పశువుల షెడ్లు, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, సంరక్షించడం తెలంగాణ క్రీడామైదానాలు శుభ్రం చేయడం చెరువులు కుంటలు పూడిక తీత ఇలా 265 పనులు చేపట్టనున్నారు.

ఊరూరా గ్రామసభలు..

సాంకేతిక సహాయకులు(టెక్నికల్ అసిస్టెంట్‌లు) రోజుకు మూడు నుంచి నాలుగు గ్రామాల్లో పర్యటిస్తారు. ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏ పనికి ఎన్ని నిధులు అవసరమనేది గుర్తించి అంచనా తయారు చేస్తారు. వారి వెంట ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి ఉంటారు. వచ్చే నెల ఆఖరు లోపు పనులు గుర్తించి గ్రామ సభలో తీర్మాణం చేసి మండలానికి నివేదిక అందజేస్తారు.అక్కడ అంచనాలు పూర్తి చేసి జిల్లా కార్యాలయానికి అక్కడి నుంచి రాష్ట్ర స్థాయి అధికారులకు డిసెంబర్ 31 లోపు అందజేస్తారు. రాష్ట్ర స్థాయి అధికారులు ఏప్రిల్ 1 నుంచి ఎంపిక చేసిన పనులకు పరిపాలన పరమైన అనుమతులు ఇస్తు ఉత్తర్వులు జారీ చేస్తారు. ఆ మేరకు గ్రామాల్లో ఆయా పనులు చేపట్టేందుకు అవకాశం లభిస్తుంది.

జిల్లాలో వివరాలిలా..



ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్న వారు	2,03,102
ఇప్పటివరకు పని కల్పించిన కుటుంబాలు	47,333
పనిచేస్తున్న కూలీలు	73,881
వంద రోజులు పూర్తి చేసుకున్న కూలీలు	315
కూలీలకు చెల్లించిన నగదు	రూ.3,819.62 లక్షలు
రోజుకు కూలీలకు సగటున	రూ.202.92
జిల్లాలో మొత్తం చెల్లించిన నగదు	రూ.4,932.57 లక్షలు
జిల్లాలో సామగ్రి ఖర్చు	రూ.790.51 లక్షలు

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధిహామీ పనులను గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నాం. గ్రామ ప్రజల ఆమోదం తీసుకొని 2025-26 వార్షిక ఉపాధి పనుల కోసం ప్రణాళికలు తయారు చేసి, రాష్ట్ర స్థాయిలో అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పక్కాగా పనుల గుర్తింపు చేపట్టి వచ్చే నెల ఆఖరు వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ముందుకు వెళతాం.

– మొగులప్ప, డీఆర్డీఓ నారాయణపేట

ఉద్యాన పంటలకు పెద్దపీట

ఉద్యాన పంటలు సాగుచేసేలా రైతులను ప్రోత్సహించనున్నారు. తక్కువ నీటితో అధిక దిగుబడిలు వచ్చే పంటలపై అవగాహన కల్పిస్తారు. ప్రధానంగా మామిడి, జామ, దానిమ్మ, ఉసిరి, బత్తాయి, సీతాఫలం, నిమ్మ, దానిమ్మ, మునగ, జీడి మామిడి వంటి 12రకాల పండ్లతోటల సాగు చేసే వారికి ఆర్థిక భరోసా ఇవ్వనున్నారు. ఐదు ఎకరాల్లోపు భూములున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం బిందు, తుంపర పరికరాలు, మిగిలిన వారికి పరికరాలు పంపిణీ చేయనున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు విన్నవిస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట: రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేసేందుకు జిల్లాలోని ప్రతి కాటన్ మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేలా చూడాలని భారతీయ కిసాన్ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో ఆయనను కలిసి మాట్లాడారు. సీసీఐ కేంద్రం ఏర్పాటు కాకపోవడంతో ప్రైవేటు వ్యాపారస్తులకు తక్కువ ధరకు విక్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి ఉంటుందని, సిపిఐ ద్వారా వెంటనే కొనుగోలు ప్రారంభించాలన్నారు. స్పందించిన అడిషనల్ కలెక్టర్ మార్కెటింగ్ డీఎంఓతో మాట్లాడారు. త్వరలోనే ప్రారంభిస్తామని డీఎంఓ తెలియజేశారు. విన్నవించిన వారిలో ఆ సంఘం నాయకులు రంగారెడ్డి, బాలప్ప, అనంతరెడ్డి, ఆకుల వెంకటప్ప , తంగ్ విశ్వనాథ్ రెడ్డి, బాపనపల్లి రాము, అంజయ్య యాదవ్, లక్ష్మప్ప, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు చేస్తే చర్యలు : ఎస్పీ

నారాయణపేట: జిల్లా పరిధిలో సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం, ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధమైన పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ యోగేష్‌గౌతమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయంగాను, కుల, మత, ప్రాంతీయంగాను ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్న వాటిని సామాజిక మాధ్యమాలలో షేర్ చేసినా చట్టప్రకారం తీవ్రమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఒక వర్గానికి కించపరిచే విధంగా ఉన్న, తమకు తెలియని వీడియోలు, ఫొటోలు పోస్టులు చేసినా.. వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేసిన ఆ గ్రూపు అడ్మిన్ నీ బాధ్యుడిగా చేస్తూ, ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సామాజిక మధ్యమాలను మంచి పనులకు తప్ప వేరే రకంగా వినియోగించే వాళ్లపైన ప్రత్యేకంగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని, జిల్లాలో ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిని అనుక్షణం పోలీసులు గమనిస్తూ ఉండాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

25 నుంచి వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సొంత నిధులతో ఈనెల 25 నుంచి వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాస్ లేదా ఫెయిల్‌పై మూడు నెలల పాటు బ్యూటీషియన్ కోర్సు, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, కంప్యూటర్ కోర్సు (ఎంఎస్ ఆఫీస్)లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈనెల 24 వరకు దరఖాస్తులు అందజేయాలని, వివరాల కోసం 94415 65895 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కందనూలు వాసికి 'ఉన్నత' గౌరవం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిది పర్వతాయిపల్లి
- స్వగ్రామంలో హర్షాతిరేకాలు



ప్రొ. బాలకిష్టారెడ్డి

తాడూరు: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఎన్నికైన బాలకిష్టారెడ్డిది జిల్లాలోని తాడూరు మండలం పర్వతాయిపల్లి. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థానానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన రాంరెడ్డి, ముత్యాలమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఆరుగురు కుమార్తెలు కాగా.. నాలుగో కుమారుడైన బాలకిష్టారెడ్డి 10వ తరగతి వరకు పక్క గ్రామమైన కుమ్మెర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. వనపర్తి కృష్ణదేవరాయ కళాశాలలో ఇంటర్మీడియట్, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశారు. ఢిల్లీలోని జేఎన్‌టీయూలో ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ పూర్తిచేసిన అనంతరం నల్సార్ యూనివర్సిటీలో ప్రొఫెసర్, రిజిస్ట్రార్, వీసీగా పనిచేశారు. ప్రస్తుతం టెక్ మహేంద్ర యూనివర్సిటీలో డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

కష్టపడే మనస్తత్వం..



మా సోదరుడు బాలకిష్టారెడ్డిది కష్టపడేతత్వం. చిన్నతనం నుంచి కష్టపడి చదువుకున్నారు. మారుమూల గ్రామమైన పర్వతాయిపల్లికి తెలంగాణలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఈ స్థాయికి ఎదగడం ఆనందంగా ఉంది.

– వెంకట్‌రెడ్డి, సోదరుడు

ప్రభుత్వ పాఠశాలలో చదివాడు



మాది రైతు కుటుంబం. 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు. ఎన్నో ఉన్నత పదవులు చేపట్టారు. సుమారు 30 దేశాల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు.

– సత్యంరెడ్డి, సోదరుడు

కష్టపడి చదివి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందని గ్రామస్తులు వివరించారు.

క్లుప్తంగా

చెరువులో పడి మహిళ మృతి

హన్వాడ: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం హన్వాడ పెద్ద చెరువులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. చిన్నదర్పల్లి గ్రామం నీల్యానాయక్‌తండాకు చెందిన ముడావత్ రుక్మిణి(27) ఈనెల 14న తన తల్లిగారి ఊరైన మహమ్మదాబాద్ మండలంలోని మొకర్లాబాద్‌కు వెళ్లింది. బుధవారం నీల్యానాయక్ తండాకు వచ్చే క్రమంలో హన్వాడకు వచ్చింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు పెద్దచెరువుకు వెళ్లింది. చెరువులో జారిపడి నీటిలో మునిగి చనిపోయింది. ఆమెకు భర్త మోహన్‌నాయక్, కొడుకు, కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

కొడుకు మృతిని తట్టుకోలేక తండ్రి హఠాన్మరణం


ఆంజనేయులు (ఫైల్)


హేమంత్ (ఫైల్)

అడ్డాకుల: అనారోగ్యం బారినపడ్డ కుమారుడి చికిత్సల కోసం ఆ తండ్రి రూ. లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. బీటెక్ చదువుతున్న కుమారుడు కళ్లెదుటే అనారోగ్యంతో మృతి చెందడాన్ని తట్టుకోలేకపోయాడు. తీవ్ర మనోవేదనకు గురై హఠాన్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటన మూసాపేట మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మూసాపేటకు చెందిన బర్రెంకి ఆంజనేయులు (52) లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. వనపర్తి జిల్లా కొత్తకోటలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఆంజనేయులు వంట మనిషిగా పని చేసేవాడు. చిన్న కుమారుడు హేమంత్ (23) హైదరాబాద్‌లో ఉంటూ బీటెక్ చదువుతుండేవాడు. కొన్నాళ్ల క్రితం హేమంత్ రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఆస్పత్రుల్లో రూ. లక్షలు పోసి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. గతనెల 22న హేమంత్ చనిపోయాడు. చేతికొచ్చిన కొడుకు చనిపోయాడన్న బాధతో ఆంజనేయులు దిగాలు చెందాడు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఉండే పెద్ద కొడుకు వద్దకు అతడి భార్య లక్ష్మి వెళ్లగా.. మంగళవారం రాత్రి ఒక్కడే ఇంట్లో నిద్రించాడు. నిద్రలోనే గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలాడు. నెల రోజుల వ్యవధిలోనే తండ్రి, కొడుకు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటో బోల్తా.. వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. గుడిపల్లి గ్రామానికి చెందిన బొజ్జయ్య (75) ఈ నెల15న పని నిమిత్తం ఆటోలో జిల్లాకేంద్రానికి వస్తుండగా ప్రమాదవశాత్తు గంధం బావి వద్ద ఆటో బోల్తాపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన బొజ్జయ్యను చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి మృతుడి కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..


దౌలత్(ఫైల్)

ధరూరు: నాలుగు రోజుల క్రితం పెబ్బేరు వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధరూరు గ్రామానికి చెందిన చికెన్ సెంటర్ దౌలత్ (50) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన దౌలత్ నాలుగు రోజుల క్రితం కొత్తకోటలో తన బంధువుల వద్దకు బైక్‌పై బయల్దేరగా.. పెబ్బేరు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని రాత్రి ధరూరుకు తీసుకొచ్చారు. మృతుడికి భార్య రజియా, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇదిలా ఉండగా.. మూడేళ్ల క్రితం దౌలత్ సోదరుడు కూడా రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

నేడు విద్యాసదస్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని క్రౌన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అఖిల భారత విద్యాసదస్సు నిర్వహించనున్నట్లు మిల్లిమహాజ్ మహబూబ్‌నగర్ చీఫ్ ప్యాట్రన్ ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాష తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తఫ్సీర్ ఇక్బాల్, ఢిల్లీకి చెందిన ప్రముఖ విద్యావేత్త సమీర్ అహ్మద్ సిద్దిఖీ, టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దన్, డాక్టర్ అబ్దుల్ ఖదీర్, ఇర్ఫాన్ కరీంతో పాటు పలువురు విద్యావేత్తలు హాజరవుతారని తెలిపారు. సదస్సులో విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హాఫీజ్ ఇద్రీస్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు తేలితే చర్యలు


జడ్చర్ల శివారులోని క్వారీలో కొలతలు వేస్తున్న గనులశాఖ అధికారులు

- తెలంగాణ మైన్స్ డీడీ నర్సింహారెడ్డి
- జడ్చర్ల మండలంలో రాతి క్వారీల పరిశీలన

జడ్చర్ల: క్వారీల నిర్వహణకు సంబంధించి నిబంధనలను అతిక్రమించినట్లు తమ విచారణలో తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం జడ్చర్ల, శంకరాయపల్లి శివార్లలో కొనసాగుతున్న రాతి క్వారీలను జిల్లా మైన్స్ ఏడీ సంజయ్‌కుమార్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాజు, సర్వేయర్ సుజాతలతో కలిసి తనిఖీ చేశారు. క్వారీల కేటాయింపు విస్తీర్ణం తదితర వివరాల కోసం డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలను నిర్వహించారు. గతంలో చేపట్టిన పాత విధానాలకు భిన్నంగా నూతనంగా వచ్చిన సాంకేతికతో శాస్త్రీయ విధానంలో సర్వే నిర్వహించడంతో ఖచ్చితత్వమైన ఫలితాలు వెలువడే అవకాశాలు ఉంటాయని అధికారులు వెల్లడించారు.

ఒకే చోట మూడు క్వారీలు..

జడ్చర్ల శివారు సర్వే నంబర్ 28లోని 4.58 హెక్టార్లలో భవాని స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో క్వారీలో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఇదే క్వారీని అనుసరించి శంకరాయపల్లి పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 385/1లో ఒక హెక్టార్ విస్తీర్ణంలో శ్రీనివాస క్వారీ, బెథెల్ పేరుతో 1.88 హెక్టార్లలో మరో క్వారీ కొనసాగుతోంది. అందులో శ్రీనివాస క్వారీ గడువు 2006 మార్చి 22న ముగియగా.. బెథెల్ క్వారీ గడువు 2020 డిసెంబర్ 31న ముగిసింది. అయితే గడువు ముగియడంతో ఆ రెండు క్వారీలు కొనసాగడం లేదని క్వారీల నిర్వాహకులు చెబుతున్నా.. తొవ్వకాలు సాగిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొదటగా మూడు క్వారీలు ఒకే ప్రదేశంలో ఉండటం.. రెవెన్యూ సరిహద్దులు వేర్వేరుగా ఉండటంతో సంబంధిత అధికారుల సహకారంతో సరిహద్దులను గుర్తించి, ఆయా క్వారీల విభజన ప్రకారంగా కొలతలతో విచారించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆరోపణల వెల్లువ..

క్వారీల కేటాయింపు తదితర నిర్వహణలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శంకరాయపల్లి పరిధిలోని సర్వే నంబర్ 385లో 4.20 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా.. ఇదే భూమిలో కొన్నేళ్లుగా క్వారీలకు అనుమతులు తీసుకున్నట్లు తెలిసింది. అయితే అసైన్డ్ భూములు ఎవరికి ఇచ్చారు.. ఎవరు ఆ భూములను లీజుకు ఇచ్చారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే విధంగా భవాని స్టోన్ క్రషర్ నిర్వాహకులు నిబంధనల మేరకు తొవ్వకాలు చేపట్టారా.. తొవ్విన క్వారీకి సంబంధించి ప్రభుత్వానికి ఎంతమేరకు రాయల్టీ పన్నులు కట్టారు.. కట్టిన పన్నులకు, తొవ్విన మెటీరియల్‌కు పోలిక సరిపోయిందా అన్న విషయాలపై విచారించే అవకాశం ఉంటుందని తెలిసింది. కాగా, క్వారీల నిర్వహణలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని.. కొన్నేళ్లుగా ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా రాయల్టీ పన్ను చెల్లింపులోనూ అవకతవకలు జరిగాయని.. వాటిపై పారదర్శకంగా విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు..

రాజాపూర్: అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. సీనరేజ్ చార్జీల విషయంలో అవినీతికి పాల్పడిన మైన్స్ ఏడీ విజయ్‌కుమార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వివరాల మేరకు.. బాలానగర్‌లోని సర్వే నంబర్ 118/పీలోని పెద్దచెరువు కాల్వను ఓ ప్రైవేటు సంస్థకు చెందిన వ్యక్తులు మట్టితో పూడ్చివేశారు. దీనిపై గత ఫిబ్రవరిలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే మట్టి తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి కోట్లాది రూపాయల డబ్బు చెల్లించలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్ సదరు సంస్థకు రూ. 5.12 కోట్ల సీనరేజ్ చార్జీలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయితే మైన్స్ ఏడీ విజయ్‌కుమార్ జనగామ జిల్లాకు బదిలీ అయ్యే ఒకరోజు ముందు సీనరేజ్ చార్జీలు రూ. 5.12 కోట్లు చెల్లించాల్సిన అవసరం లేదంటూ మాఫీ చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఈ నెల 14న మైన్స్ ప్రిన్స్‌పల్ సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. జనగామ మైన్స్ ఏడీగా పనిచేస్తున్న విజయ్‌కుమార్‌పై బుధవారం సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పీహెచ్‌సీ డాక్టర్ X డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

- వాట్సప్ వేదికగా అవినీతి ఆరోపణలు

ఉప్పునుంతల: డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ.. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ బిక్కులాల్ బుధవారం వాట్సప్‌లో పోస్టింగ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. మంగళవారం పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మహిళా సిబ్బందిని ఇష్టానుసారంగా దుర్భాషలాడారని.. డివిజన్‌లో పనిచేస్తున్న సిబ్బంది తాను చెప్పినట్లు వినాలని పేర్కొన్నారని.. గతేడాది వైద్యాధికారులకు ఇవ్వాల్సిన బడ్జెట్‌ను నొక్కేశాడని.. వాహనాల అద్దెకు సంబంధించి డాక్టర్లకు ఇవ్వాల్సిన డబ్బులు రూ. 8 లక్షల వరకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓనే నొక్కేశాడనే ఆరోపణలతో కూడిన మెసేజ్‌ను మీడియా గ్రూప్‌లో పోస్టు చేశారు. అయితే బడ్జెట్‌తో సంబంధం లేని తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నందుకు గాను పరువు నష్టం దావా వేస్తానని.. బీకేర్‌ఫుల్ డాక్టర్ బిక్కులాల్ అంటూ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తారాసింగ్ వాట్సప్‌లో పోస్టింగ్ చేశారు. అందుకు డాక్టర్ బిక్కులాల్ వాట్సప్‌లో సమాధానమిస్తూ.. మహిళా సిబ్బందిని బాధ పెట్టి, ఇతరులు ఫార్వడ్ చేసిన మెసేజ్‌ను తనకు అంటగడతావా.. కంటి వెలుగు, హాస్పిటల్ పెయింటింగ్‌కు సంబంధించిన డబ్బులు డాక్టర్లకు ఇవ్వకుండా మీరే తినలేదా అంటూ నేరుగా పోస్టు చేశారు. తనకు రావాల్సిన కంటి వెలుగు డబ్బులు రూ. 2 లక్షలు ఇవ్వలేదంటూ పేర్కొన్నారు. ఈ వాట్సప్ చాటింగ్‌లపై డాక్టర్ బిక్కులాల్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారులు విచారణ చేస్తే, అన్ని విషయాలు బయటకు వస్తాయని తెలిపారు. పీహెచ్‌సీకి సంబంధించిన తన డ్రాయింగ్ పవర్‌ను ఇటీవల మరో డాక్టర్ స్వప్నకు ఇవ్వడంతోనే డాక్టర్ బిక్కులాల్ తనపై ఉద్దేశపూర్వకంగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ తెలిపారు. అతడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి పీయూ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సౌత్ జోన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి సంబంధించి పీయూ నుంచి ఈనెల 18న బాడ్మింటన్ పురుషుల విభాగంలో జట్ల ఎంపికలు ఉంటాయని పీయూ పీడీ డా.వై.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 19న తైక్వాండో పురుషుల విభాగంలో, 21న కబడ్డీ మహిళలు, పురుషుల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 17–25 ఏళ్లలోపు కలిగి, పదోతరగతి మెమో, ప్రస్తుతం చదువుతున్న బోనఫైడ్‌లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన బ్యాడ్మింటన్ జట్టు చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో, తైక్వాండో జట్టు పంజాబ్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో, కబడ్డీ జట్లు అలగప్పా యూనివర్సిటీ జరిగే సౌత్ జోన్ పోటీలలో పాల్గొంటాయన్నారు.

ప్రాణాలకు ముప్పు తెచ్చే కంపెనీలు పెట్టొద్దు

- ఇథనాల్ ఫ్యాక్టరీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్తులు


పెద్దదన్వాడలో కంపెనీ వారిని అడ్డుకున్న స్థానికులు

రాజోళి: మనుషుల ప్రాణాల మీదకు తెచ్చే కంపెనీలు పెట్టి జీవన మనుగడకు ప్రమాదం తీసుకురావద్దని పెద్ద దన్వాడ గ్రామస్తులు అన్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెద్ద దన్వాడ గ్రామం తుంగభద్ర నదీ తీరంలో ఉంది. కాగా ఏపీలోని మదనపల్లికి చెందిన వారు ఈ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ పెట్టేందుకు భూములు కొన్నారు. వారు బుధవారం గ్రామంలోకి రాగా.. గ్రామస్తులు వారిని నిలదీశారు. మా గ్రామంలో ఫ్యాక్టరీ స్థాపించడం వల్ల గ్రామానికి ఆపద వాటిల్లుతుందని, అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని వారు అన్నారు. మానవపాడు మండలం కలుకుంట్ల, ఇటిక్యాల మండలం జింకలపల్లె వద్ద గతంలో నిర్మించిన ఫ్యాక్టరీల వల్ల అక్కడి ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో తెలుసని, అలాంటి పరిస్థితి మా గ్రామాల్లో వస్తే ప్రజల ఇబ్బందులు పట్టించుకునే వారు ఎవరని గ్రామ రైతులు కంపెనీ సిబ్బందిని అడిగారు. ప్రభుత్వం నుంచి మీకు అనుమతులు వచ్చినప్పటికీ, అధికారులు మా కళ్లెదురుగా భూపరీక్షలు, కంపెనీ ద్వారా వెలువడే వాయువులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ అధికారులు మాకు గ్యారెంటీగా ఉంటే కంపెనీ ఏర్పాటుపై ఆలోచిస్తామని అన్నారు. ఇథనాల్, ఆల్కహాల్ వల్ల పలు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశముందని, వాటి ఏర్పాటు కోసం ప్రజల ప్రాణాలు పణంగా పెడితే ఒప్పుకోమని అన్నారు. కంపెనీ ఏర్పాటు కోసం జరిగే పరీక్షలు ప్రజలందరీ సమక్షంలో జరగాలని వారు డిమాండ్ చేశారు.

మరింత తగ్గిన ఉల్లి ధరలు



దేవరకద్ర: ఉల్లి ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. మార్కెట్‌కు కొత్త ఉల్లి రాకతో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం క్వింటాల్ ఉల్లి గరిష్టంగా రూ. 2,600, కనిష్టంగా రూ. 1,100 ధరలు వచ్చాయి. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తాను గరిష్టంగా రూ. 1,300, కనిష్టంగా రూ. 550 వరకు విక్రయించారు. అదేవిధంగా హంసధాన్యం క్వింటాల్ రూ. 1,851 ధర పలికింది. ఆముదాలు క్వింటాల్ రూ. 5,909 ధర వచ్చింది.

బస్సులో చోరీ : 9 తులాల బంగారం అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సులో చోరీ జరిగి 9 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన జిల్లాకేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. జిల్లాకేంద్రానికి చెందిన సువర్ణ కల్వకుర్తికి వెళ్లేందుకు తన కుమారుడితో కలిసి బస్సు ఎక్కింది. మంతటి చౌరస్తాకు బస్సు చేరుకోగానే కుమారుడికి టికెట్ తీసుకునేందుకు బ్యాగులో పర్సు కోసం వెతకగా కనిపించలేదు. పర్సులో 9 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని.. బస్సు ఆపి ప్రయాణికుల వద్ద వెదికినా దొరకకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- రూ.2 లక్షల నగదు, 6 బైకులు స్వాధీనం

గద్వాల: జిల్లాకేంద్రం జమ్మిచేడు శివారులో ఓ లాడ్జిలో పేకాటాడుతున్న స్థావరంపై స్పెషల్ బ్రాంచ్, గద్వాల రూరల్ పోలీసులు దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. జమ్మిచేడు పరిధిలోని జములమ్మ దగ్గర ఎస్‌ఆర్‌వీ లాడ్జిలో పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి నిర్వహించగా రూ.2,00,790 నగదు, 6 బైకులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పేకాట ఆడుతున్న 12 మంది అదుపులోకి తీసుకుని వారి వద్దనున్న 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోగా.. ఒకరు పరారీ అయ్యారు. అరెస్టు అయిన వారిలో దండు రాజు(వేముల), గొల్ల, గోవిందు(వేముల), నంబి గోపినాథ్ (బీరెల్లి), బాగిరెడ్డి గోపాల్‌రెడ్డి(ధర్మవరం), గొల్ల సురేష్(నారాయణపూరం), ఉప్పరి నాగరాజు (పెద్దపల్లి), గౌని యుగంధర్‌రెడ్డి(బీరెల్లి), బలిజ రాజశేఖర్ (తుమ్మలచెర్వు), నరేష్‌రెడ్డి, (నారాయణపురం), బోయ ఈశ్వర్, (పూడూరు), 11.గొల్ల వెంకటేష(పెద్ద దిన్నె), కౌకుంట్ల చంద్రమోహన్(గద్వాల) ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రాంచంద్రారెడ్డి మృతదేహం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అనంతపురం దయ్యాలవాగు వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గద్వాలకు చెందిన రాంచంద్రారెడ్డి (26) మంగళవారం అర్ధరాత్రి వ్యక్తిగత పనుల నిమిత్తం కారులో ఎర్రవల్లి క్రాస్‌రోడ్డుకు వెళ్లి.. తెల్లవారుజామున 4 గంటల సమయంలో గద్వాలకు బయలుదేరాడు. ఈ క్రమంలో అనంతపురం గ్రామశివారులోని దయ్యాలవాగు సమీపంలో బ్రిడ్జి వాల్‌ను వేగంగా ఢీకొట్టాడు. గమనించిన స్థానికులు.. రూరల్ పోలీసులు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతి కష్టంమీద కారులో నుంచి రాంచంద్రారెడ్డిని బయటికి తీసి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, మద్యం మత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. మృతుడు ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేశాడు. ప్రమాదంపై తండ్రి పటేల్ ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ..

స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ఆయన సతీమణి జ్యోతి పరామర్శించారు. ప్రమాద తీరును అక్కడి పోలీసులతో తెలుసుకున్నారు. రాంచంద్రారెడ్డి మృతిపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, భరతసింహారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సెమీస్‌లో మహబూబ్‌నగర్


అదిలాబాద్-నల్గొండ జట్ల మధ్య కొనసాగుతున్న మ్యాచ్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ ఆనంద్

- హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

గద్వాలటౌన్: గద్వాలలో కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు తుది దశకు చేరాయి. రంగారెడ్డి, నల్గొండ, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జట్లు అద్భుతమైన ప్రదర్శనతో సెమీ ఫైనల్‌కు చేరాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలు మూడోరోజు కొనసాగాయి. ప్రతి మ్యాచ్ హోరాహోరిగా సాగింది. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో క్రికెట్ మ్యాచ్‌లు సెమీస్‌కు చేరాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌ల క్రీడాకారులను డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ పరిచయం చేసుకున్నారు.

➪ కరీంనగర్-నల్గొండ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో నల్గొండ జట్టు విజయం సాధించింది.

➪ మెదక్- వరంగల్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక వికెట్ తేడాతో వరంగల్ గెలుపొందింది. అదిలాబాద్-నల్గొండ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో అదిలాబాద్ జట్టు విజయం సాధించింది. వరంగల్- ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో ఖమ్మం జట్టు గెలిచింది. మెదక్- హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

➪ లీగ్ దశలో గ్రూపు-ఏ నుంచి అదిలాబాద్, కరీంనగర్, నిజాంబాద్ జట్లపై రంగారెడ్డి జట్టు విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరింది. నిజాంబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జట్లుపై నల్గొండ జట్టు గెలిచి సెమీ ఫైనల్‌కు చేరింది.

➪ గ్రూపు-బీ నుంచి మెదక్, ఖమ్మం, వరంగల్ జట్లపై విజయం సాధించి హైదరాబాద్ జట్టు సెమీ ఫైనల్‌కు చేరింది. మెదక్, వరంగల్ జట్లపై మహబూబ్‌నగర్ జట్టు గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరింది. గురువారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

19న ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని అడ్డాకుల మండలం వేముల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈనెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ (జోనల్ క్రీడలు) నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎంపికచేసిన విద్యార్థుల లిస్టు, ఎలిబిలిటిఫామ్, బోనఫైడ్‌తో రావాలని కోరారు. మిగతా వివరాల కోసం పీడీ నిరంజన్‌రావు 8919193768 ను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు

జిల్లాకేంద్రంలోని స్టేడియంలో ఈనెల 19వ తేదీన అండర్-14, అండర్-17 విభాగాల బాలబాలికల ఉమ్మడి జిల్లా ఆర్చరీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు శారదాబాయి తెలిపారు. విద్యార్థులకు బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. మిగతా వివరాల కోసం 9010804720ను సంప్రదించాలని కోరారు.

ఏషియన్ నెట్‌బాల్ భారత మహిళా జట్టు కోచ్‌గా విక్రం


విక్రంఆదిత్యరెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: బెంగళూర్‌లో జరగనున్న 13వ అంతర్జాతీయ మహిళల ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత మహిళా జట్టుకు కోచ్‌గా జిల్లాకు చెందిన నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి నియమితులయ్యారు. ఈనెల 17 నుంచి 27 వరకు కర్నాటక రాష్ట్రం బెంగళూర్‌లోని కోరమాండల్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భారత మహిళా జట్టుకు జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో రెండు పర్యాయాలు కోచింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రంఆదిత్యరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ హరి ఓం కౌశిక్, అధ్యక్షులు సుమన్ కౌశిక్, కార్యదర్శి విజయేందర్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విక్రం ఆదిత్యరెడ్డి నియామకం పట్ల నెట్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, కోశాధికారి సోహైల్ ఉర్ రహెమాన్ ఖాన్, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

టెక్నికల్ ఆఫీసర్‌గా రామ్మోహన్‌గౌడ్..



ధన్వాడ: కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన పీడీ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టెక్నికల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి, కోశాధికారి సోహైల్ రెహమాన్‌ఖాన్, ప్రిన్సిపల్ రాజరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో.. క్రస్టు గేట్ల మూసివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్ ఫ్లోలు స్వల్పంగా తగ్గాయి. మంగళవారం రాత్రి 8 గంటల వరకు ప్రాజెక్టుకు 61 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం రాత్రి 8 గంటల వరకు 40వేల క్యూసెక్కులకు తగ్గింది. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గడంతో తెరిచి ఉంచిన మూడు క్రస్టు గేట్లను మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 39,357 క్యూసెక్కుల నీటిని వినియోగించు కుంటున్నారు. ఆవిరి రూపంలో 70 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు,ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 41,188 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో నీటిమట్టం 884.4 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 884.4 అడుగుల వద్ద 211.9572 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల, సుంకేసుల నుంచి మొత్తం 78,002 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలంలో ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,900 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,776 మొత్తం 67,676 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డి పాడు ద్వారా 8,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,547, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,364 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సుంకేసులో 8 గేట్లు ఎత్తివేత

రాజోళి: సుంకేసుల డ్యాంలో బుధవారం 8 గేట్ల ద్వారా నీటి విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 35,780 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 34,216 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసి 1,058 క్యూసెక్కులను కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

నవజాత శిశువు మృతి

- ఏరియా ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన


ఆందోళనకారులకు నచ్చజెప్పుతున్న పోలీసులు

జడ్చర్ల టౌన్: ప్రసవ సమయంలో నవజాత శిశువు (బాబు) మృతిచెందిన ఘటన జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో బుధవారం చోటుచేసుకుంది. శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మున్సిపాలిటీలోని నాగసాలకు చెందిన గర్భిణి కీర్తికి బుధవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. విధుల్లో ఉన్న డాక్టర్ల సూచనల మేరకు సిబ్బంది ప్రసవం చేశారు. అయితే శిశువు ఉమ్మనీరు మింగి మృతిచెందినట్లు డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది తెలియజేశారు. అయితే డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమ బాబు మృతిచెందాడని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న బంధు మిత్రులు ఆస్పత్రికి చేరుకొని రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన చేపట్టారు. ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చిన ఆశ కార్యకర్తపై మండిపడ్డారు. ప్రసవం సమయంలో డాక్టర్ లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే పక్కనే మరో మహిళ ప్రసవం చేయడంలో డాక్టర్ ఉండటంతో రాలేకపోయారని సిబ్బంది వివరించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శివానంద్ అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ నూతనంగా ప్రారంభించబడిన VSR ఎంటర్‌ప్రైజెస్ నందు పనిచేయుటకు సూపర్‌వైజర్స్, ఎగ్జిక్యూటివ్ ఫీల్డ్ ఆఫీసర్స్, లేడీ టెలికాలర్స్, ITI All Trades వెంటనే కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం 15,000 నుండి 25,000. ఫోన్ : 88866 60569.

■ ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో Team Leadersగా మహబూబ్‌నగర్ మరియు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q:10th ఆపై Age:25 ఆపై Ph: 9393055164.

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 9160900024

భవిత విద్యార్థుల కోసం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ప్రాతిపదికగా పరిగణించి ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పూర్తిగా విచారించాలని కోరుతున్నాం. ప్రకటనదారు చెప్పే సంస్థలు, చెల్లింపులు జరపమని కోరినప్పుడు బ్యాంకు ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ / చెల్లింపులు చేయవచ్చు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజర్